ప్రజాశక్తి
మంగళవారం 19 నవంబర్ 2024
5
పార్వతీపురం మన్యం

కలెక్టర్‌ను కలిసిన డిపిఒ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లా గ్రామ పంచాయతీ అధికారిగా టి.కొండలరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. పంచాయతీలు పారిశుధ్య నిర్వహణ, తాగునీరు సరఫరా తదితర అంశాల్లో ఆదర్శంగా నిలిచి అవార్డులు అందుకునే దశలో ఉండాలన్నారు. స్వచ్ఛ సుందర పార్వతీపురంలో భాగంగా ప్రతి పంచాయతీలో ఆహ్లాదకర వాతావరణం నెలకొనాలని ఆయన చెప్పారు. కొండలరావు అల్లూరి సీతారామరాజు జిల్లా డిపిఒగా బదిలీపై జిల్లాకు వచ్చారు.

'పల్లె పండగ'కు బాలారిష్టాలు

కూటమి ప్రభుత్వం వచ్చాక సర్పంచుల గౌరవానికి భంగం కలగకుండా చూస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పదేపదే చెబుతూ వస్తున్నారు. అయితే గ్రామాల అభివృద్ధికి పంచాయతీరాజ్, ఉపాధిహామీ సంయుక్తంగా చేపట్టిన పల్లెపండగ అభివృద్ధి పనుల విషయానికి వచ్చేసరికి సర్పంచులకు ఆ స్థాయిలో గౌరవం దక్కడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకు ఉదాహరణ గానే మండలంలో జరుగుతున్న పల్లె పండగ అభివద్ధి పనులే నిదర్శనమని సర్వత్రా వినిపిస్తున్నాయి.

పాపయ్యవలసలో చేపడుతున్న సిసి రోడ్డు పనులు

- సగం పనులు తమకు ఇవ్వాలని సర్పంచుల మెలిక
- తలలు పట్టుకుంటున్న అధికారులు
- నత్తనడకన పనులు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలో పల్లె పండుగ అభివృద్ధి పనులు 102 గుర్తించారు. ఇందుకోసం రూ.6.33 కోట్లతో నిర్మాణం చేపట్టనున్నారు. ఇప్పటి వరకు సుమారు 26 పనులు వివిధ పంచాయతీల్లో పూర్తికావచ్చాయి. ఇంకా 76 పనులు జరగాల్సి ఉంది. అయితే మండలంలోని 21 పంచాయతీలో ఎ.వెంకంపేట, తూరుమామిడి, కోన, నంద పంచాయతీల మినహా మిగిలిన చోట్ల అంతా వైసిపి సానుభూతిపరులే సర్పంచులుగా కొనసాగుతున్నారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న పనులకు పంచాయతీల తీర్మానం అవసరం ఏర్పడింది. కొన్నిచోట్ల టిడిపి నాయకులు స్థానిక సర్పంచులకు సమాచారం ఇవ్వకుండా పనులు చేపడుతున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. డిసెంబర్ 5 నాటికి పనులన్నీ పూర్తి చేసి పండగ వాతావరణం నెలకొల్పాలన్న జిల్లా అధికారుల ఆదేశాలతో మండల స్థాయి అధికారులకు మేడ మీద కత్తి పెట్టినట్లు అయింది. ఇప్పటికే తన పంచాయతీలో పూర్తిస్థాయిలో పనులు జరగాలంటే తమకు సగం వాటాగా పనులు కేటాయించాలని తీర్మానాల కోసం వెళ్తున్న అధికారుల వద్ద సర్పంచులు మెలిక పెడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఏం చేయాలో అధికారులకు తెలియని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని టిడిపి నియోజకవర్గస్థాయి నాయకుల వద్ద కూడా అధికారులు ప్రస్తావించినట్లు తెలిసింది. ఈ దశలో ఇరు పార్టీలు ఒక కొలిక్కి వస్తే కానీ పల్లె పండుగ అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో జరిగే ఆస్కారం ఉంటుందని పలువురు చర్చించుకుంటున్నారు. వీరిని ఒకే తాటిపైకి తెచ్చేందుకు మరోవైపు అధికారులు కూడా నలిగిపోతున్నట్లు సమాచారం.

వారికి పనులిచ్చే పరిస్థితి లేదు

పల్లె పండుగ పనులకు సంబంధించి పంచాయతీ స్థాయిలో వైసిపి సానుభూతిపరులకు పనులు అప్పగించే పరిస్థితి లేదని మండల టిడిపి అధ్యక్షులు జి వేణుగోపాల్ నాయుడు అన్నారు. 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ గతంలో వారు అధికారంలో ఉండేటప్పుడు టిడిపి నాయకులకు ఎక్కడైనా పనులు ఇచ్చారా అని ప్రశ్నించారు. ఆగస్టులో జరిగిన గ్రామసభల్లో ఆయా పనులకు సంబంధించిన తీర్మానాలు ఇచ్చారని తెలిపారు. ఒకవేళ తీర్మానాలకు ఆటంకాలు కలిగించినట్లయితే తాము ఎలా చేయించుకోవాలో తెలుసు అని అన్నారు. ఆయా పంచాయతీల్లో నేతల మధ్య ఉన్న సయోధ్య నేపథ్యంలో వారు అంగీకరిస్తే పనులు చేయించుకోవచ్చని, అంతేగానీ 50శాతం వాటాలంటూ కుదరవని ఆయన స్పష్టం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని..

ఆశా, సిహెచ్‌డబ్ల్యుఒల ధర్నా

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు వైద్యాధికారి డాక్టర్ జగన్మోహనరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గౌరీశ్వరి, శివాని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు యూనియన్ నాయకులు కె.బృందా, రజిని, సిఐటియు జిల్లా నాయకులు వి. ఇందిర మాట్లాడుతూ ఆశా వర్కర్లకు గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కొత్త సెల్ ఫోన్లు ఇవ్వాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్ ఇన్సూరెన్స్, మట్టి ఖర్చులు ఇతర సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు గిరిజన ప్రాంతంలో ప్రజలకు అనేక సేవలు అందిస్తున్నారని, ఇస్తున్న రూ.4వేలు వేతనం కూడా ప్రతి నెలా రావడం లేదని చెప్పారు. గతంలో బకాయి పడ్డ 21 నెలలు పెండింగ్ జీతాలు చెల్లిస్తామని చెబుతూ కాలయాపన చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా గుర్తించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశాలకు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత, ఇతర సమస్యలు పరిష్కరించాలని చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ గౌరవ అధ్యక్షులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, కోశాధికారి జి.వెంకటరమణ, నాయకులు కొల్లి సాంబమూర్తి బి.సూరిబాబు, లక్ష్మి, భాగ్యం సౌజన్య. ప్రమీల, గౌరి, గంగాభవాని, అబ్దుల్లా, అరు కరుణ పలువురు ఆశాలు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు

ఎన్నికల డబ్బులు ఇప్పించాలని వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం

గత ఎన్నికల సమయంలో తీసిన ఫొటోలు, వీడియోలకు తమకు చెల్లించాల్సిన డబ్బులు ఇప్పించాలని పాలకొండ నియోజకవర్గం ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. సిఐటియం జిల్లా నాయకులు జి.వెంకటరమణ ఆధ్వర్యాన ఫొటో, వీడియో గ్రాఫర్లు ఫిర్యాదు చేశారు. తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీ వాత్సవకు వినతిపత్రం అందజేశారు.

ముమ్మరంగా ఎన్‌సిడి సర్వే

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఎన్‌సిడి సర్వే ముమ్మారంగా చేపట్టారు. సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ వివరాలతో పాటు కేన్సర్ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు.

వినతులను స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శోభిక

పిజిఆర్‌కు 156 వినతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి 156 వినతులు అందాయి. జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఐటిడిఎ పిఒ అశోతోష్ శ్రీవాస్తవ అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయిలో పిజిఆర్ఎస్

ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని (పిజిఆర్ఎస్) మండల స్థాయిలో పకడ్బందీగా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో పిజిఆర్ఎస్ నిర్వహిస్తుండగా, మున్సిపాలిటీల్లో మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయిలో తహశీల్దార్లు, ఎంపిడిఒలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మండల, మున్సిపాలిటీ స్థాయిల్లో ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించవచ్చని ఆయన స్పష్టం చేశారు. మండల, మున్సిపాలిటీ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా స్థాయి పిజిఆర్ఎస్‌లో సమర్పించాలని ఆయన సూచించారు. అనవసర వ్యయ ప్రయాసలకోర్చి దూర ప్రాంతాల నుంచి రావాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

108 ఉద్యోగుల దీక్షలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

108 అంబులెన్స్ ఉద్యోగులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళనలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ, 108 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గొర్లి అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలోని అత్యున్నతమైన ప్రజా సేవగా 108 గుర్తింపు పొందిందని, అలాంటి వ్యవస్థను ప్రభుత్వం నేరుగా నిర్వహించకుండా ప్రైవేట్ సర్వీస్ ప్రొవైడర్లకు అప్పగించడం దారుణమన్నారు. ప్రైవేట్ సంస్థలు తమ లాభాపేక్ష వల్ల సర్వీసుల నాణ్యత పోతుందని, అందులో పనిచేస్తున్న కార్మికులకు, ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ సదుపాయాలు, గ్రాడ్యుటీ, పెన్షన్ సౌకర్యం కల్పించడం లేదన్నారు. వాహనాలు కండీషన్‌లో లేకపోవడం వల్ల ప్రమాదాలకు గురై అనేకమంది ఉద్యోగులు మరణిస్తున్నారని, వీరికి ఎలాంటి పరిహారం ప్రభుత్వం గానీ, యాజమాన్యం గానీ, చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.. 8గంటల పని దినం అమలు చేయాలని, ప్రావిడెంట్ ఫండ్ యాజమాన్య వాటా యాజమాన్యం చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 108 సర్వీస్ ప్రొవైడర్‌గా ఉన్న అరబిందో కంపెనీ చెల్లించాల్సిన బకాయి వేతనాలు, ఇతర బిల్లులు తక్షణమే చెల్లించాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపై ఇప్పటికే అనేక దఫాలుగా అధికారులకు, మంత్రులకు విన్నవించుకున్నా ఎలాంటి ఫలితం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని, లేకుంటే ఈనెల 25నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రమణా రావు, వై.మన్మధరావు, కోశాధికారి గొర్లి వెంకట రమణ, 108 ఉద్యోగ సంఘం నాయకులు తెర్లి వెంకటరమణ, తెంటు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్ష చేస్తున్న 108 అంబులెన్స్ ఉద్యోగులు

నేడు ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం, ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ ఎస్), గృహ నిర్మాణం, సూర్య ఘర్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ను సోమవారం నిర్వహించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా ఈనెల 19 నుంచి డిసెంబర్ 10 వరకు అవగాహన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో పెద్ద ఎత్తున చేపట్టేందుకు జెడ్‌పి సిఇఒ, డిపిఒ, గ్రామీణ నీటి సరఫరా అధికారి సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద దీన్ని చేపట్టడం జరుగుతోందనితెలిపారు. బహిరంగ మలవిసర్జన సామాజిక దురాచారమని, మరుగుదొడ్ల వినియోగం ఆత్మ గౌరవం పెంపొందిస్తుందని, కావున ప్రజలు అందరికి అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక పాల్గొన్నారు.

ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో సచివాలయ ఆధార్ కేంద్రాల్లో నిర్వహించబోయే ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి బి.రామ్‌గోపాల్ కోరారు. ఈనెల 19 నుంచి 22 వరకు, తిరిగి 26 నుండి 29 వరకు జిల్లాలో ఆధార్ స్పెషల్ డ్రైవ్‌లు జరగనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ట్రైబల్ వెల్ఫేర్, ఐసిడిఎస్, పలువురు అనాథ పిల్లలు తదితరులు అధికంగా ఆధార్ లేకుండా ఉన్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారని పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లాలో 49 ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కేంద్రాల్లో ప్రజలు కొత్తగా నమోదు చేసుకోవడం, పెండింగ్ బయోమెట్రిక్, డాక్యుమెంట్ అప్డేషన్ తదితర ఆధార్ సంబంధిత ప్రక్రియలు, పాఠశాల, కళాశాలలో విద్యార్థులు అపార్‌కు సంబంధించి ఆధార్ సవరణలు పూర్తి చేసుకోవాలని కోరారు. జిల్లాలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆధార్‌ను కలిగి ఉండేలా కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

అధికారులతో సమీక్షిస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సిసిడిపి నిధులను ఖర్చు చేయాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలో సిసిడిపి పథకం కింద చేపడుతున్న ఇంజినీరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎలో సిసిడిపి నిధుల వినియోగంపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిసిడిపి ద్వారా గిరిజన గ్రామాల్లో చేపడుతున్న ఇంజినీరింగ్ పనులైన రక్షణ గోడలు, మల్టీపర్పస్ కేంద్రాలు, గ్రామాలకు సిసి రోడ్లు వంటి పనులను డిసెంబర్ 15 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా జీవనోపాధి పథకాలను అమలు చేసేందుకు లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. సిసిడిపి నిధులతో సవర భాషను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ చిన్నబాబు, ఇఇ రమాదేవి, డిఇలు సింహాచలం, సిమ్మన్న, ఎఇలు నాగభూషణరావు, మోహన్‌గోపాల్, సింధూజ, వెలుగు ఎపిడి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు

బోగస్ ధ్రువపత్రాలపై విచారణ

బోగస్ ఎస్టీ కుల దవపత్రాలకు సంబంధించిన విచారణను పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం 5 కేసులను విచారించారు. కేసులకు సంబంధించి ఇరువర్గాల వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించారు. అనంతరం విచారణను ఈనెల 25నాటికి వాయిదా వేసినట్లు పిఒ తెలిపారు. కార్యక్రమంలో డిడి అన్నదొర, సూపరిండెంట్ దేశ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయుల వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. దశాబ్ద కాలంగా జిల్లాలో గల గురుకుల పాఠశాలల్లో చాలీచాలని జీతాలతో పని చేస్తున్నామని తెలిపారు. తమను కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా మార్చాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల తో కుటుంబ పోషణ కష్టంగా మారుతోందని చెప్పారు.

స్వచ్ఛ పంచాయతీలుగా తీర్చిదిద్దాలి : డిపిఒ

ప్రజాశక్తి - కురుపాం

స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దాలని జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం స్వచ్ఛ సుందర పార్వతీపురం జిల్లా కార్యక్రమంలో భాగంగా 5 మండలాల ఎంపిడిఒలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులు, ఇఒపిఆర్‌డిలతో ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ కలలుగన్న గ్రామ సీమలు నెలకొనాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛమైన గాలి, నీరు, పరిసరాలు ఉండాలని, ప్రతి గ్రామం ఆరోగ్య సీమలు కావాలని ఆయన సూచించారు. సమష్టి కృషితో దేనినైనా సాధించవచ్చని ఆయన పేర్కొంటూ స్వచ్ఛ సుందర పార్వతీపురం జిల్లాలో భాగంగా "చేయి - చేయి కలుపుదాం", స్వచ్ఛ గ్రామ పంచాయతీ - స్వచ్ఛ సుందర జిల్లాను తీర్చిదిద్దుదామని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రత పాటించాలనప్పుడే స్వచ్ఛ సుందర సాధ్యమని ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు అన్నారు. స్వచ్ఛ ఆంధ్రా సలహాదారు సి.శ్రీనివాసన్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో మన ఇంటి పక్కన ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి చేద్దాం అన్నారు. కార్యక్రమంలో ఎంపిపీ శెట్టి పద్మావతి, జట్టు ఆశ్రమ నిర్వాహకులు పద్మజ, పలువురు సర్పంచులు, ఎంపిటిసిసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రామచంద్రరావు

గిరిజన సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని గిరిజనులు ఎదుర్కొంటున్న రహదారులు, ప్రభుత్వ భవనాలు, విద్య, వైద్యం, తదితర సమస్యలు పరిష్కరించాలని, సాలూరులో గిరిజన భవనాన్ని నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. మండల సిపిఎం మహాసభ మామిడిపల్లిలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడిపల్లిలో అసంపూర్తిగా ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల భవన నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని, కురుకుట్టిలో తలపెట్టిన హైడ్రో పవర్ ప్లాంట్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో అక్రమంగా చేపడుతున్న మైనింగ్ తవ్వకాలను అరికట్టాలని, తోణాం, కురుకుటి, దండిగాం ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని, గిరిజన విద్యార్థులకు ఉపాధి నిచ్చే కార్యక్రమాలు చేపట్టాలని, ఆంధ్రా ఒడిస్సా వివాదాస్పద కొటియా గ్రామాలకు శాశ్వత పరిష్కారం చూపాలని, అన్ని గిరిజన ప్రాంతాల్లో రహదారులు, మంచినీటి సదుపాయాలు కల్పించాలని కోరుతూ తీర్మానించారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా మర్రి శ్రీనివాసరావు, సభ్యులుగా సీదరపు అప్పారావు, గిమ్మేల గాసి, గెన్నెల సుందర్రావు, వంతల సుందర్రావు, లచ్చయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కోరాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

విద్యార్థుల మరణాలకు ప్రభుత్వానిదే బాధ్యత

ప్రజాశక్తి- పార్వతీపురం

జిల్లాలో జరుగుతున్న గిరిజన విద్యార్థుల మరణాలకు రాష్ట్ర ప్రభుత్వమే భాధ్యత వహించాలని పలువురు విద్యార్థి, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో, గిరిజన వసతి గృహల్లో ఎఎన్ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. ఎఎన్ఎమ్‌ల నియామకం ఫైల్ పై మొదటి సంతకం పెట్టామన్నా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట అమలు కాలేదని అన్నారు. మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు పది లక్షల రూపాయలు పరిహారం ఇవ్వాలని, రావడ రామ భద్ర పురం గిరిజన ఆశ్రమ పాఠశాల హెడ్ మాస్టర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటిడిఎ పిఒ అసుతోష్ శ్రీ వస్తావ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పండు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవి కుమార్, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి రంజిత్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంగునాయుడు, సూరయ్య, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కూరంగి సీతారాం, ఎఐటియూసి నాయకులు జీవ, కుమార్, దుర్గారావు, మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పిఒకు వినతిని అందజేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

ఎంపిడిఒకు వినతి పత్రాన్ని అందిస్తున్న ఎఎన్ఎంలు

ఎఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సీతానగరం

సచివాలయ ఎఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ జిల్లా అధ్యక్షులు బి రమాదేవి కోరారు. సోమవారం ఎంపిడిఒ పి.త్రివిక్రమ రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు డిపార్ట్‌మెంట్ల మధ్య నలిగిపోతున్నామని ఆరోగ్యశాఖ నుంచి కమిషనర్ ఇచ్చిన జీవో ప్రకారం సచివాలయ పనులు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఈ జీవోను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు రవణమ్మ, స్వర్ణ, ఇంద్ర, విజయ గౌరీ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాపు కార్పొరేషన్ డైరెక్టర్

ప్రజాశక్తి - కొమరాడ

మంత్రిని సత్కరిస్తున్న సేనాపతి శేఖర్, తదితరులు

టిడిపి మండల అధ్యక్షులు సేనపతి శేఖర్ పాత్రుడును ఇటీవల టిడిపి ప్రభుత్వం కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పదవి కట్టబెట్టింది. దీంతో ఆయన జిల్లా ఇంఛార్జి మంత్రి కింజరాపు అచ్చం నాయుడుని సోమవారం అమరావతిలో క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మరో మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరితో వెళ్లి కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శేఖర్ పాత్రుడు మాట్లాడుతూ తనకు కేటాయించిన పెదవుకు న్యాయం చేసి కాపు కార్పొరేషన్ అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కురుపాం పోల్ కో ఆర్డినేటర్ పొట్నూరు వెంకట నాయుడు, అరకు పార్లమెంట్ ఎస్‌టి సెల్ అధికార ప్రతినిధి కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై కక్ష సాధింపు ధోరణి

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

రాష్ట్ర విద్యాశాఖ అధికారుల తీరు ఉపాధ్యాయుల మీద కక్ష సాధించుకునేలా ఉందని అందువల్లనే అనవసరమైన విషయాలపైచర్చకు తావిస్తూ ఉపాధ్యాయులను బలి పశువులుగా చేస్తున్నారని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఉన్నత పాఠశాలల పని వేళలు దశాబ్దాల నుండి రోజుకు 7 గంటల చొప్పున శాస్త్రీయంగా నిర్ణయించడం జరిగిందని, విద్యార్థులు వారి వారి ఇండ్ల వద్ద చదువు కోవడానికి కూడా వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. ప్రస్తుత విద్యాశాఖ అధికారులకు ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల చదువు పట్ల నిజమైన అపేక్ష ఉన్నట్లయితే ఉపాధ్యాయులను పూర్తిగా బోధనేతర పనుల నుంచి మినహాయించి విద్యార్థుల పట్ల వారి నిబద్ధతను వారి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ఔనత్యాన్ని దెబ్బతీసే చర్యలకు తెర తీయవద్దని హితవు పలికారు.

ప్రకృతి వ్యవసాయ స్టాల్ పరిశీలన

ప్రజాశక్తి- పాచిపెంట

స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎఒ తిరుపతిరావు

ప్రకృతి వ్యవసాయ స్టాల్లో కూరగాయలు ఆకు కూరలతో పాటుగా ప్రకృతి సేద్యం చేసే రైతులకు ఉపయోగపడే కషాయాలు కూడా విక్రయిస్తున్నామని ఎఒ కె. తిరుపతిరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ రైతుకు దశ పత్ర కషాయాన్ని అందజేశారు. కషాయాలు తయారు చేసుకోలేని ప్రకృతి సేద్య రైతులకు తక్కువ ధరకు కషాయాలు తయారు చేసి విక్రయిస్తున్నారన్నారు. తులసి బాస్మతి నవారా మైసూరు మల్లికా వంటి సాంప్రదాయ బియ్యం కూడా ఈ స్టాల్‌లో విక్రయిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్లను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- బలిజిపేట

ఆధార్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ -1 సింహాచలం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)ను త్వరితగతిన పూర్తి చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మండలంలో ప్రత్యేకంగా ఆధార్ సెంటర్‌లను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల పుట్టిన తేదీ, పేరు, చిరునామా తదితర మార్పులకు సంబంధించి ఈ ఆధార్ సెంటర్లలో సరి చేస్తారన్నారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో తీసుకున్న జనన ధ్రువపత్రం తప్పనిసరిగా ఉండాలన్నారు. బర్త్ సర్టిఫికెట్ ఆధారంగా మార్పులు చేర్పులు ఆధార్ సెంటర్లో చేస్తారని చెప్పారు. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు మరల 26 నుంచి 29వ తేదీ వరకు వంతరాం, ఎన్ఎన్‌వలస, పెద పెంకి, బలిజిపేట, చిలకలపల్లి, నారాయణపురం, అజ్జాడ, అరసాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు పనిచేస్తాయని, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

220 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

ఒడిశా నుంచి కురుపాం వైపు ఆటోతో అక్రమంగా తరలిస్తున్న 220 లీటర్ల నాటు సార ను మాలతమ్మ గుడి సమీపంలో స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పి.నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగుపురం గ్రామ సందర్శన నిమిత్తం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటోను మాలతమ్మ గుడి సమీపంలో అనుమానస్పదంగా ఆపగా గుమ్మలక్ష్మీపురం మండలం గొరడకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఆటోలో ఐదు లారీ ట్యూబ్లో, క్యాన్లో 220 లీటర్లు నాటుసారాను తీసుకొని వస్తుండగా పట్టుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

20న ఐటిడిఎ స్థాయి పోటీలు

ప్రజాశక్తి - సీతంపేట

జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 15న క్లస్టర్ స్థాయిలో జరిగిన వివిధ క్రీడలు, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో క్లస్టర్ స్థాయిలో ఎంపికైన విద్యార్థులు ఈనెల 20న ఐటిడిఎలోని గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో నిర్వహించబోయే ఐటిడిఎ స్థాయి పోటీలకు హాజరుకావాలని పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిడిఎ స్థాయిలో జరిగే పోటీలో ఎంపికైన విద్యార్థులు ఈనెల 23 నుంచి 26 వరకు విశాఖపట్నంలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారని తెలిపారు.

అంపావల్లిలో పంటకోత ప్రయోగం

ప్రజాశక్తి- బలిజిపేట

ధాన్యం కొలత వేస్తున్న సిబ్బంది

ఖరీఫ్ పంట కోత ప్రయోగంలో భాగంగా సోమవారం అంపావల్లి గ్రామంలో పంటకోత ప్రయోగం ఎఒ శ్రవణ్ కుమార్ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాండమ్ నెంబర్ పద్ధతుల్లో సర్వే నెంబర్ 86-21లో ఈ పంటకోత ప్రయోగం బంకూరు గౌరునాయుడు అనే రైతు పొలంలో నిర్వహించారు. దీనిలో భాగంగా చదరపు మీటర్లు దూరంలో ప్రయోగం నిర్వహించగా సుమారు 14,800 కేజీల దిగుబడి వచ్చిందనీ దీని ప్రకారం ఎకరాకి సుమారు 2397.6 కేజీల దిగుబడి అంచనా వేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులు కె. శ్రావణ్ రైతులు పాల్గొన్నారు.

ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 79 వినతులు

ప్రజాశక్తి - సీతంపేట

అర్జీదారులతో మాట్లాడుతున్న పిఒ యశ్వంత్‌కుమార్

స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో పిఒ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పరిధిలోని గిరిజనులు తమ సమస్యలపై వినతి పత్రాలను సమర్పించారు. అడ్డంగి రెవెన్యూ గల ఉన్న తమ భూములకు డికెటి పట్టాలు ఇప్పించాలని కొత్తూరు మండలం ఐదుపాడు కొత్తగూడ గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. సీతంపేట మండలం జజ్జువ గ్రామానికి చెందిన సవర అనిల్ కిండంగి నుంచి జజ్జువ గ్రామానికి సిసి రోడ్డు మంజూరు చేయాలని, శంభాం పంచాయతీ బుక్కిరుగూడ గ్రామానికి చెందిన సవర సునీత ఆశావర్కర్ ఉద్యోగం ఇప్పించాలని వినతిపత్రం సమర్పించారు. అలాగే పుబ్బాడ గ్రామస్తులు తమ గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. భామిని మండలం నవరపాడుకు చెందిన బిడ్డిక లక్ష్మా వ్యవసాయం చేసుకోనేందుకు ఆయిల్ ఇంజన్ మంజూరు చేయాలని, ఇప్పమానుగూడకు చెందిన ఆరిక సింగారు కొండచీపుర్ల వ్యాపారం చేసేందుకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. మూలగూడకు చెందిన గ్రామస్తులు తమ భూములకు రెవెన్యూ పట్టాలు ఇప్పించాలని, మాసగూడకు చెందిన ఆరిక ఇర్రయ్య మేకల రుణం మంజూరు చేయాలని కోరారు. పాలకొండలోని వంతవాడకాలనీకి చెందిన మండంగి కృష్ణ తమ గ్రామంలోని 85 సర్వే నెంబర్ లో గల 96 చెట్లు ఉన్న భూమిపై సమగ్ర విచారణ జరిపి తగు న్యాయం చేయాలని కోరారు. సీతంపేట మండలం జొన్నగూడకు చెందిన సవర మోహనరావు తమ గ్రామానికి సామాజిక భవనం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ చినబాబు, ఇఇ రమాదేవి, డిడి అన్నదొర, పిహెచ్ఒ గణేష్, వెలుగు ఎపిడి సన్యాసిరావు, ఎఒ సునీల్, డిప్యూటీ డిఇఒ నారాయుడు, స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానంద్, సిడిపిఒ రంగలక్ష్మి, ఎఒ సునీల్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిరోజూ గ్రీవెన్స్

పాలకొండ: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం ప్రతి రోజూ గ్రీవెన్స్‌కు శ్రీకారం చుట్టారు. నగర పంచాయతీ సమస్యలపై పల్లా కొండలరావు వినతులు స్వీకరించి అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఫిర్యాదులు స్వీకరించినట్టు తెలిపారు. అలాగే రాబోయే రోజుల్లో పింఛన్లు, ఇళ్లు మంజూరువ్వతాయని, అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులకు అందిస్తామని, ప్రజలందరికీ అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కారం తీసుకుంటానని అన్నారు. పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ జయరాం, వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్, తమ్మారావు, రాంబాబు, తదితరులు ఉన్నారు

21న మున్సిపల్ వేలం

పార్వతీపురంటౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయానికి సంబంధించి తోటపల్లి హెడ్ వాటర్ వర్క్స్ వద్ద గల జీడి, మామిడి, కొబ్బరి చెట్ల ఫలసాయం 1-7-2024 నుండి 30-7-2027 వరకు అనుభవించుటకునే నిమిత్తం, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లో ఖాళీగా ఉన్న 22, 32, 34, 35, 44, 46, 48 షాపులకు ఈనెల 21న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ (ఎఫ్ఎసి) శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు పూర్తి సమాచారం కోసం రెవెన్యూ విభాగం అధికారులను కలవాలని తెలిపారు.

బిటి రోడ్డు పనులు ప్రారంభం

సీతానగరం : మండలంలోని అంటిపేట నుంచి వెన్నెల బుచ్చంపేట గ్రామాల మధ్య బిటి రోడ్డు పనులను సర్పంచ్ బొంగు తిరుపతిరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా గతంలో రోడ్డు పనులు ప్రారంభించినప్పటికీ మెటల్ వేసి ఉండిపోయిన రోడ్డును కూడా ప్రారంభించారు. ఈ రోడ్డు పనులు ప్రారంభం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు అంటిపేట నుంచి కోమటిపల్లి వరకు వెళ్తుందన్నారు. ఆయా గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం: విద్యార్థులతో మాట్లాడుతున్న సిఐ హరి

సైబర్ నేరాలు బారిన విద్యార్థులు పడకుండా దూరంగా ఉండాలని సిఐ హరి అన్నారు. సోమవారం స్థానిక పోస్ట్ మెట్రిక్ కళాశాల విద్యార్థులకు సంకల్పం కార్యక్రమంలో భాగంగా సైబర్ క్రైమ్, యాంటీ డ్రగ్స్, రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్లకు అన్నోన్ నెంబర్ల నుంచి ఫోన్ చేసి బ్యాంకు లోన్లు ఇస్తామని నమ్మించడానికి చూసి మన దగ్గర అమౌంట్ లాక్కుంటారని, అటువంటి వాటిని ఎవరూ నమ్మొద్దని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై నారాయణరావు, వార్డెన్ సీతమ్మ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : మాదక ద్రవ్యాలు వాడకం వల్ల యువత అనేక రుగ్మతలుకొని తెచ్చుకుంటున్నారని, అలాగే అర్హత లేకుండా యువత ద్విచక్ర వాహనాలు వాడడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ఎఎస్ఐ లంక శ్రీను అన్నారు. ఆర్.వెంకంపేట జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులతో మాదకద్రవ్య నిర్మూలన, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించే భాగంగా విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల అనేక రుగ్మతలకు గురవుతారన్నారు. మాదక ద్రవ్యాలు వాడకం వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించడంతో పాటు ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక బస్టాండ్ సమీపాన స్థానిక పోలీసులు సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు, మహిళ భద్రత గురించి అవగాహన కల్పించారు.

కురుపాం :సైబర్ నేరాలు, మహిళా భద్రతపై విద్యార్థులకు, యువతకు అవగాహన ఉండాలని నీలకంఠపురం ఎస్ఐ నీలకంఠరావు సూచించారు. సోమవారం మండలంలో ధర్మలక్ష్మిపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల సంకల్పం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళా భద్రత, ఇతరత్రా నేరాల పట్ల అవగాహన కల్పించారు. డ్రగ్స్, గంజాయి, మద్యం తదితర మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉన్నప్పుడే ఉన్నతస్థాయికి చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అక్కిన, సన్యాసిరావు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యుపిహెచ్‌సిలో డిపిఒ తనిఖీ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

రికార్డులను పరిశీలిస్తున్న డిపిఒ జగన్మోహన్‌రావు

పట్టణంలోని జగన్నాథపురంలో గల పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, ప్రతి రోజూ ఆసుపత్రిలో వైద్య సేవలు వినియోగించుకుంటున్న వారికి నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీల వివరాలు రికార్డుల్లో పరిశీలించారు. దీర్ఘకాలిక రోగులను పరీక్షించేటప్పుడు వారి ఆరోగ్యం ఏ మేరకు మెరుగుపడుతుందో పర్యవేక్షించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల ఆరోగ్య సమస్యలు స్పష్టంగా తెలుసుకోవాలన్నారు. అదే సందర్భంలో అక్కడకు వచ్చిన రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకొని తగు సూచనలు చేశారు. వారికి వైద్యాధికారి వైద్య పరీక్షలు జరిపారు. గర్భిణులతో మాట్లాడి ఆరోగ్య స్థితి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది గర్భిణుల పర్యవేక్షణ విషయమై ఆరా తీశారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్ ల్యాబ్‌లో వైద్య పరికరాల పనితీరు, రియేజంట్స్ పరిశీలించారు. వ్యాక్సిన్ నిల్వలు పరిశీలించి క్షేత్ర స్థాయిలో వినియోగించే తేదీలు, వయల్స్‌పై నమోదు తప్పనిసరి అని ఆదేశించారు. ఐఎల్ఆర్ నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. మందుల నిల్వలు పరిశీలించి కాలపరిమితి చేరువలో ఉన్న వాటిని సద్వినియోగం చేయాలన్నారు. కుక్క, పాముకాటు మందుల లభ్యత పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణ శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఆరోగ్య కార్యక్రమాలు పూర్తి స్థాయిలో అమలు జరిపి ప్రగతి నివేదికలు పురోగతికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ పిహెచ్‌సి వైద్యాధికారి జె.పరిమళ, డిఎస్ఒ శంకర్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

విఆర్ఎల అక్రమ అరెస్టులు అన్యాయం

ప్రజాశక్తి - కురుపాం

మక్కువ : నిరసన తెలుపుతున్న విఆర్ఎలు

విఆర్ఎల అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు అన్యాయమని విఆర్ఎల సంఘం అధ్యక్షులు జి.ఈశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎలతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలపై విజయవాడలో శాంతియుతంగా రాయబారానికి వెళ్లడానికి రాష్ట్ర కమిటీ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న విఆర్ఎలను ఎక్కడికక్కడ గృహనిర్బంధాలు, అరెస్టులు చేయడం ప్రభుత్వానికి సమంజసం కాదన్నారు. ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని ఎక్కడా మేము తెలియజేయలేదని, తమ సమస్యలు తెలియజేయడానికి శాంతియుతంగా రాయబారానికి వెళ్లడానికి సిద్ధమైన నేపథ్యంలో ప్రభుత్వం ఇలా చేయడం సమంజసం కాదని అన్నారు. ప్రభుత్వం దిగొచ్చి తక్షణమే విఆర్ఎల హక్కులు అమలు చేయాలని అన్నారు. లేనిచో విఆర్ఎల హక్కుల సాధనకు ఎంత దాకైనా వెళ్లడానికి సిద్ధమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలో గల వీఆర్ఏలు పాల్గొన్నారు.

మక్కువ : విజయవాడలో జరగనున్న ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా అన్ని మండలాల్లో ప్రభుత్వం పోలీసులతో నిర్బంధాన్ని ప్రయోగించి నిరోధించడానికి నిరసిస్తూ మక్కువలో విఆర్ఎల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు జి.కృష్ణ మాట్లాడారు. సమస్యలు పరిష్కరించమని సిసిఎల్ఎకు వినతిని ఇచ్చేందుకు రాష్ట్ర కమిటీ పిలుపునివ్వగా, విఆర్ఎలను గృహనిర్బంధాలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విఆర్ఎల సంఘం మండల కార్యదర్శి పవన్ కళ్యాణ్, అధ్యక్షులు గంట సాంబమూర్తి, నాయకులు పార్వతి, హైమా, సింహాచలం, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : విఆర్ఎలపై నిర్బంధాన్ని ఆపాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం తలపెట్టిన రాయబారం కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుండి విజయవాడ రాకుండా నాయకులను ఎక్కడికక్కడ నిర్బంధించారని, ఇటువంటి నిర్బంధాలను ఖండిస్తున్నట్టు విఆర్ఎల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పాపారావు, జగన్ తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు రాజమాణిక్యం, దమయంతి, లక్ష్మీప్రసన్న, సీతమ్మ, పార్వతమ్మ , మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అడవిపై హక్కు ఆదివాసీలదే

ప్రజాశక్తి - మక్కువ

అడవిపై హక్కు ఆదివాసీలదేనని, అడవులను నాశనం చేస్తున్న మైనింగ్ కంపెనీలను అరికట్టాలని రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కామ్రేడ్ తిరుపతి వర్ధంతి సందర్భంగా సోమవారం రైతు కూలి సంఘం గిరిజన భవన్ నుంచి మార్కెట్ షెడ్ వరకు ర్యాలీ చేసి అనంతరం రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షుల ఊయక ముత్యాలును అధ్యక్షతన సభ జరిగింది. తొలుత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ విదేశీ కార్పొరేట్ మైనింగ్ కంపెనీలు అడవులను దోచుకోవడానికి వస్తున్నాయని, వీటిని ఎదుర్కోవడానికి అందరూ సమయతమై పోరాటాలు చేసినప్పుడే గిరిజనులకు భవిష్యత్తు ఉంటుందని అన్నారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్ల అనేక బంజరు, పోరంబోకు భూములు భూస్వాములు, పెత్తందారుల చేతుల్లో ఉన్నాయని, వీటి కోసం పోరాడితే తప్పుడు కేసులు బనాయించి అరెస్టులకు పాల్పడుతున్నారని అన్నారు. వీటిని మనమంతా కలిసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శులు పి.శ్రీను నాయుడు, ఎం.భాస్కరరావు, ఉపాధ్యక్షులు పి. అసిరి, కె.వెంకటస్వామి, గిరిజన సంఘం నాయకులు ఎం.చెంచు, కందులపదం సర్పంచ్ తాడంగి కన్నంనాయుడు, దుగ్గేరు, మూలవ, దుగ్గేరు, మూలవలస, మెండంగి తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ జె.రామారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. విద్యార్థులు పాఠ్యపుస్తకాలు మాత్రమే కాక, సూచీ గ్రంథాలను కూడా అధ్యయనం చేయాలన్నారు. చదవడానికి శ్రద్ధ ఉండాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంఘం అధ్యక్షులు టి.శివకేశవరావు, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం చరిత్రను వివరించారు. నిరంతర అధ్యయనం ద్వారా లక్ష్యాలను చేరుకోవడానికి ప్రయత్నించాలని సూచించారు. తల్లి దండ్రుల, ఉపాధ్యాయుల మన్ననలు పొందాలన్నారు. చిరంజీవులు, ముక్తేశ్వరి, లలిత, కృష్ణవేణికి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఉపన్యాసకులు సుకన్య, శాంతి, తెర్లి రవికుమార్ పాల్గొన్నారు.

సీతంపేట : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. స్థానిక గవర్నమెంట్ హై స్కూల్‌లో సుమారు 35 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. యువతపై మాదక ద్రవ్యాల ప్రభావం అన్న అంశంపై ఈ పోటీ నిర్వహించారు. ఇందులో విజేతలకు ఈనెల 20న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా బహు మతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి బి.గణేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివకుమార్, పాణీగ్రహి, గిరిజ, లక్ష్మణ రావు, గ్రంథాలయ సహాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

బలిజిపేట: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బలిజిపేటలో సోమవారం ఘనంగా నిర్వ హించారు. చిత్ర లేఖనం, వ్యాస రచన, క్విజ్, క్రీడల పోటీలను ఉపాధ్యాయులు సుధారాణి, మౌనికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, శాఖ గ్రంథాలయ నిర్వాహకులు బి. రాజగోపాల్ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని సిపిఐ నాయకులు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌విఎస్ కుమార్ డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ వార్డు సచివాలయాల వద్ద పట్టణంలోని పేదలకు రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలని, ఇల్లు నిర్మాణం పూర్తి కోసం రూ5.లక్షల చొప్పున మంజూరు చేయాలని కోరుతూ పేదలతో వ్యక్తిగత అర్జీలు అందించే ఆందోళన కార్యక్రమంలో భాగంగా, సోమవారం ఆయన ఆధ్వర్యంలో పట్టణంలోని చర్చివీధిలో గల 10వ సచివాలయం వద్ద పట్టణ పేదలతో సచివాలయం కార్యదర్శి ప్రసన్నకు అర్జీలు అందచేశారు. సిపిఐ నాయకులు, జిల్లా చేతివృత్తుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సింహాద్రి దుర్గారావు, ఎపి రైతు సంఘం నాయకులు ఈ.వి నాయుడు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్: పట్టణంలో గల పేదలకు 2సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని, ఇల్లు నిర్మాణానికి రూ.5లక్షలు చొప్పున మంజూరు చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జీవ కోరారు. ఈ మేరకు పట్టణంలోని 8, 24 వార్డుల్లో గల సచివాలయాల్లోని కార్యదర్శులకు స్థానికులతో కలిసి వినతిని అందజేశారు. కార్యక్రమంలో అర్జీదారులు పాల్గొన్నారు.

మరోసారి మండల సమావేశం వాయిదా

ప్రజాశక్తి - పాలకొండ

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం కూడా వాయిదా పడింది. 12మంది ఎంపిటీసిలకు గానూ ఎంపిపి బొమ్మాళ భాను మాత్రమే హాజరయ్యారు. దీనితో సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఒ విజయ రంగా రావు తెలిపారు.

అంతుచిక్కని రాజకీయాలు

మండల రాజకీయం రసవత్తరంగా మారింది. గత రెండు రోజుల నుంచి పరిణామాలు పూర్తిగా మారిపోయాయి. వైసిపి ఎంపిటిసిలు, సర్పంచ్‌లు సమావేశానికి హాజరుకాలేదు. వైసిపికి చెందిన ఎంపిపి మాత్రం సమావేశానికి హాజరుకావడంతో కూటమి వైపు అడుగులు వేస్తున్నట్లు సంకేతాలు అందుతున్నాయి. మరో ముగ్గురు ఎంపిటిసిలు సమావేశానికి వస్తారని, వీరు కూడా పార్టీని వీడు తారన్న జోరుగా ప్రచారం జరిగింది. అయితే మండల టిడిపి అధ్యక్షులు గండి రామినాయుడు ముగ్గురు ఎంపిటిసిల రాకను బహిరంగంగానే అడ్డుకున్నారు. ఎంపిడిఒ కార్యాలయానికి ఆయన అనుచరులతో చేరుకుని గత ఐదేళ్లు వారివల్లే బాధపడ్డామని, ఇప్పుడు తమ పార్టీలోకి ఎలా వస్తారని ప్రశ్నించారు. కోరం లేకపోతే ఒరిగేదేమీ లేదని, వారిని పార్టీలోకి తీసుకోమని తేల్చి చెప్పారు.

1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

సీతానగరం: 1/70చట్టాన్ని అతిక్రమించిన భూముల్లో నిర్మించిన ఇళ్లలు, షాపింగ్ కాంప్లెక్స్, రిసార్ట్స్‌లకు ఎల్టీఆర్ కేసులు నమోదు చేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.లక్ష్మణరావు, కె.అవినాష్ డిమాండ్ చేశారు. షెడ్యూల్ ఏరియాలో గిరిజనేతరులకు ఇళ్లస్థలాలు కేటాయించాలని గిరిజనేతరులు సాంఘిక సంక్షేమశాఖ మంత్రికి విన్నవించడాన్ని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. షెడ్యూల్ ఏరియాలో 1/70 చట్టం అమలులో ఉండగా గిరిజనేతరులకు ఇళ్లు మంజూరు చేయడం నిషేధమన్నారు. గిరిజనేతరులకు షెడ్యూల్ ఏరియాలో స్థలాలు మంజూరు చేస్తే ఆదివాసీల భూములు, అడవులు పూర్తిగా కబ్జా చేస్తారని ఆరోపించారు. 1/70 చట్టం పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ ఏరియాలో ఆదివాసీలకు 100శాతం ఉద్యోగాలు నియామించాలన్నారు.

ప్రభుత్వం మారినా బోర్డు మార్చని వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - కురుపాం

వైఎస్ఆర్ పేరిట ఉన్న బోర్డు..

ప్రభుత్వం మారి సుమారుగా ఐదు నెలలు అవుతున్నా వైసిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన బోర్డును మాత్రం మార్చని సంఘటన మండలంలోని తిత్తిరి పంచాయతీ టొంపలపాడు గ్రామ సబ్ సెంటర్ వద్ద చోటు చేసుకుంది. ఈ సబ్ సెంటర్ నీలకంఠాపురం పిహెచ్‌సి పరిధిలో ఉంది. వైద్యాధికారులు నెలలో రెండుసార్లు వెళ్లి గ్రామంలోని దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేయాలి. ప్రభుత్వం మారి ఐదు నెలలు అవుతున్నప్పటికీ కనీసం వారి సబ్‌సెంటర్ ముందున్న బోర్డునే మార్చకపోతే గ్రామాలకు వెళ్లి ప్రజలకు వీరు ఏం వైద్య సేవలు అందిస్తారని కూటమి నాయకులు మండిపడుతున్నారు. వైద్యాధికారులు స్పందించి బోర్డును తీసి కొత్త బోర్డులు ఏర్పాటు చేయకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

మహారాజశ్రీ విజయనగరం జిల్లా మరియు సెషన్సు జడ్జి వారి కోర్టులో
G.W.O.P No. 10/2024

Between :
పిశిని కళ్యాణి, వ॥ 40సం॥లు, W/o శ్రీనివాస్ @ శ్రీనివాసరావు, చిలకలపల్లి గ్రామం, బలిజిపేట మండలం, పార్వతీపురం మన్యం జిల్లా......పిటిషనరు
And :
- Nil - ....రెస్పాండెంటు

జనరల్ నోటీసు

పై నెంబరు పిటిషనులో పిటిషనరు భర్త గారైన పిశిని శ్రీనివాసు ఉరఫ్ శ్రీనివాసరావు సజీవముగా వున్న కాలంలో యిందలి పిటిషనరు కుమారుడు (మైనరు) అయిన పిశిని పూర్ణేష్ పేరున యిందలి పిటిషను షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని తే 25-01-2021దీ డాక్యుమెంటు నెం.559/2021. రిజిష్టర్డు Giftdeed ద్వారా దాఖలు పర్చియున్నారు. దరిమిలా సదరు శ్రీనివాసరావు తే 18-07-2021దీన కాల ధర్మం చెందియున్నారు. దరిమిలా యిందలి పిటిషనరు ఆమె కుమారుని యొక్క పూర్తి బాధ్యతలు చూసుకుంటూ జీవిస్తూ యున్నారు. దరిమిలా వారి జీవన భృతి మరియు అవసరము నిమిత్తం యితరులు వద్ద అప్పులు చేసినందున సదరు అప్పులు తీర్మాణించు నిమిత్తము మరియు జీవన భృతి కొరకు కుమారుని యొక్క ఎదుగుదల మరియు వారి జీవన భృతి కొరకు నగదు అవసరం ఉన్నందున యిందలి షెడ్యూలు దాఖలా ఆస్తిని విక్రయించుటకు అనుమతి కోరుతూ యి పిటిషను దాఖలు చేసియున్నారు. పైనెంబరు పిటిషను **తే 09-12-2024దీ**కి వాయిదా అయి ఉన్నది. ఏవరికైన ఏట్టి అభ్యంతరములు ఉన్న యెడల వాయిదా తేది **ఉదయం 10-30 గం॥** లగాయితు పై కోర్టులో స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని వ్రాతపూర్వకంగా తెలియజేయవలసినదిగా ఆజ్ఞాపించడమైనది. లేని యెడల చట్ట పరంగా తీర్పు జారీ చేయబడునని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షెడ్యూలు

జిల్లా :- పార్వతీపురం మన్యం, మండలం :- బలిజిపేట, గ్రామం :- పెదపెంకి, ఆస్తి వివరం :- మెట్టు భూమి, ఖతా నెం:- 672.
1) S.No-562/3, Ac 1-78 Cents
2) S.No-562/5A, Ac 0.78 Cents
మొత్తం విస్తీర్ణం :- Ac 2.56 Cents

//కోర్టువారి ఆర్డరు ప్రకారం//
అల్లాడ నగేష్ కుమార్
పిటిషనరు తరుపు న్యాయవాది,
బొబ్బిలి, సెల్ : 9849879051